క్లుప్తంగా

భోగేశ్వరుడి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలో గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర స్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపును గురువారం నిర్వహించారు. గత ఆరు నెలల నుంచి భక్తులు సమర్పించిన కానులను లెక్కించగా హుండీ ఆదాయం రూ.74,295 వచ్చినట్లు ఈఓ చంద్ర శేఖర రెడ్డి తెలిపారు. కానుకల లెక్కింపును పర్యవేక్షణాధికారి శశికుమార్ పర్యవేక్షించారు. చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు పరమేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న సీఐ మన్సూరుద్దీన్

సి.బెళగల్: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ సూచించారు. గురువారం సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పీరయ్య ఆధ్వర్యంలో మండల వినాయక చవితి ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, గ్రామాలలో ప్రజలు సామరస్యంగా మెలగాలని, పండుగలు, వేడుకలను కలిసి మెలసి జరుపుకోవాలన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలుగజేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్స నిర్వాహకులు తగు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

కోడుమూరు రూరల్ : మండల కేంద్రంలో మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందిన బోయ నాగరాజు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పరిహారాన్ని మంజూరు చేసింది. బీమా తక్షణ కింద మంజూరైన రూ.10వేలను గ్రామ సచివాలయం-3 పంచాయతీ కార్యదర్శి జనార్దన్, డిజిటల్ అసిస్టెంట్ క్రిష్ణవేణిలు మృతుడి భార్య మద్దమ్మకు గురువారం అందజేశారు. డిజిటల్ అసిస్టెంట్ క్రిష్ణవేణి మాట్లాడుతూ ప్రభుత్వం మృతుడి కుటుంబానికి ప్రమాద బీమా కింద రూ.5 లక్షల పరిహారాన్ని మంజూరు చేసిందన్నారు.

ఘనంగా గాడిచెర్ల జయంతి

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు శాఖా గ్రంథాలయంలో గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ శాఖాధికారిణి కౌసల్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో గాడిచెర్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ గాడిచెర్ల హరిసర్వోత్తమరావు ఉద్యమంతోనే గ్రంథాలయాలు ఉద్భవించాయన్నారు.అనంతరం పిల్లలకు పుస్తక పఠనం చేయించి, బహుమతులను అందజేశారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

కల్లూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలని కర్నూలు తాలూకా రూరల్ సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి సూచించారు. గురువారం 44వ జాతీయ రహదారి లక్ష్మీపురం సమీపంలో ఉన్న ఎస్ఎల్‌వీ ఫంక్షన్ హాల్‌లో ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని వినాయకుని ఉత్సవ కమిటీ సభ్యులతో, గ్రామాల పెద్దమనుషులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అందరూ ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలకు ఉచితంగా పుస్తకాలు అందించాలి

పాణ్యం : ప్రభుత్వ కళాశాలలకు పుస్తకాలు ఉచితంగా అందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు భర్తీ చేయాలన్నారు. జీవో నంబర్ 77ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రతాప్, రాజు, సునీతా, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఎమ్మార్పీఎస్ దీక్షలు

పాణ్యం : దేశంలోని మాదిగలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు గద్దల సామేల్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం చేపడుతున్న రిలే దీక్షలు గురువారం రెండో రోజు కొనసాగాయి. వారు మాట్లాడుతూ వర్గీకరణ చేయకపోవడంతో ప్రభుత్వం అన్ని రకాల ఫలాలకు దూరమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో బాబు, చార్లెస్, రూకలయ్య, జయసూర్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించి తీరుతాం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- గగ్గటూరు, కొత్తూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



గగ్గటూరులో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పురోగతిని ప్రతినెలా అధికారుల సమీక్ష ద్వారా తెలుసుకొని, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం పాణ్యం మండలంలోని గగ్గటూరు, కొత్తూరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్ అందజేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అనతి కాలంలోనే వేల ప్రభుత్వ భవనాలు, కళాశాలలు, పాఠశాలలు, వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేసినట్లు చెప్పారు.

రూ.2 కోట్లతో వంతెన నిర్మిస్తాం

గగ్గటూరు ఊరి ముందరి వాగుపై బ్రిడ్జి కుంగిపోవడం, పక్కన కుందూ నది వల్ల చిన్నపాటి వర్షానికే బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తోందన్నారు. దీంతో ఇతర జిల్లాల నుంచి కొత్తూరు దేవస్థానానికి వచ్చే భక్తులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులతో వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. త్వరలోని అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నా రు. అనమతులు వచ్చిన వెంటనే పనులు మొదలుపెట్టి ప్రజల, భక్తులు కల నెరవేర్చుతామన్నారు.

కొత్తూరు ఆలయ ఖ్యాతి పెంచుతాం

సీమలోనే అత్యంత ఖ్యాతి కలిగిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ వైభవాన్ని చాటేలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో జరుగుతున్న జీర్ణోద్ధరణ, అభివృద్ధి పనులను పరిశీలించారు. మహాప్రాకారం, ప్రత్యేక క్యూలైన్, విడిది గదులు, కాంప్లెక్స్‌లు తదితర పనులు చకచకా జరుగుతున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్‌లు సద్దల పద్మావతమ్మ, బీరం రాజేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు సద్దల శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింట సంక్షేమం..జగనన్న ఆశయం

ఓర్వకల్లు : అర్హత కల్గిన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయంగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని హుసేనాపురం-2 సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సమస్యలను పరిష్కారాలకు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, ఎంపీపీ తిప్పన్న, గ్రామ సర్పంచు చంద్ర గోవర్ధనమ్మ, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, జేసీఎస్ మండల కన్వినర్ లోటర్‌బాషా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ సంబరం



సింగవరంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఇంటింటా సంబరాలు జరుపుకుంటున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం కర్నూలు మండలం జి.సింగవరంలో, కర్నూలు నగర పరిధిలోని 40వ వార్డు బాలాజీ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు రవిరెడ్డి, ఆదాం పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి అమ్మా, తల్లీ, అన్నా, అక్కా, చెల్లి, అవ్వా, తాతా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ-2 నెహేమ్యా, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, సొసైటీ చైర్మన్ వినయ్ కుమార్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు ప్రసాద్, సంపత్‌కుమార్, సర్పంచ్ విద్యాసాగర్, వాసు, కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఏపీఓ మధుబాబు, పీఎస్ గోవింద్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అభాగ్యులకు అండగా ప్రభుత్వం

కర్నూలు (న్యూటౌన్): అభాగ్యులకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం కర్నూలు మండలం జి.సింగవరంలో నూతనంగా మంజూరైన 28 మందికి పింఛన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. అందరి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

మెలకువలతో అధిక దిగుబడులు



గుండ్రేవులలో వైఎస్సార్ పొలం బడి నిర్వహిస్తున్న అధికారులు

సి.బెళగల్: రైతులు వరి పంటల సాగులో మెలకువలను పాటిస్తే అధిక దిగుబడులను పొందవచ్చని ఏఓ మల్లేష్‌కుమార్, ఏఈఓ సిద్ధు అన్నారు. గురువారం మండలం పరిధిలోని గుండ్రేవుల, కొండాపురం గ్రామాలలో గ్యాప్ (జీఏపీ - గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టిస్)లో భాగంగా సిబ్బందితో కలిసి వరి పొల్లాల్లో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు వరి పంట సాగువిధానంపై అవగాహన కల్పించారు. పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయ (జెడ్‌బీఎన్ఎఫ్ - జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్) పద్ధతులను తెలియజేశారు. ఈ సందర్భంగా వరి పొలంలో కాలిబాటను ఏర్పాటు చేయించి, సస్యరక్షణ పద్ధతులను వివరించారు.

పంట నమోదు చేయించుకోవాలి

రైతులు సాగుచేసిన పంటలను ఈ - పంట నమోదు చేయించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. మండలంలోని ఇనగండ్ల, గుండ్రేవుల గ్రామాలలోని ఆర్బీకేలను తనిఖీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల వ్యవసాయ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. రైతులకు ఈ పంట నమోదుపై అవగాహన కల్పించారు. ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, వీపీఏలు, రైతులు ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో నాలుగు మండలాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాలుగు మండలాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. క్యాంపులకు అవసరమైన ఆరోగ్య పరీక్షల కిట్లను, మందులను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్, నాలుగు మండలాల వైద్య అధికారులు పాల్గొన్నారు.

కల్లూరు: రేపటి నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిని హేమలత అన్నారు. గురువారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మోతిలాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా చేయాలి

కల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేయాలని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి సూచించారు. గురువారం కల్లూరు మండల పరిషత్ సమావేశ భవనంలో ఉలిందకొండ, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, పీఎస్‌లు, వలంటరీలు, ఐసీడీఎస్ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ జయన్న, లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ నస్రీన్, డాక్టర్ మదన్, ఎంఈఓ శరభయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



సి.బెళగల్‌లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభిస్తున్న అధికారులు

సి.బెళగల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ జ్యోతి సూచించారు. గురువారం సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ బలరాముడు అధ్యక్షతన బాలబాలికలకు మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను కమిటీ ఇన్‌చార్జ్, పీడీ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓ, గ్రామ సర్పంచ్ పాండురంగన్న మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడలతో శరీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరచి పాఠశాలకు, గ్రామానికి గుర్తింపు తీసుకరావాలని ప్రిన్సిపాల్ బలరాముడు అన్నారు. అనంతరం రిబ్బన్ కట్‌చేసి పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు బాలబాలికలకు అండర్-14, అండర్ -17 విభాగాలలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్ త్రోబాల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ వంటి తొమ్మిది క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. మండలంలోని 13 పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని, ప్రతిభ కనబరచిన వారిని నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేసినట్లు పీడీ, పీఈటీలు వెల్లడించారు.

రెండు వాహనాల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ): జిల్లా మైనింగ్ అధికారుల తనిఖీల్లో రెండు వాహనాలు పట్టుబడ్డాయి. గురువారం జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాలు.. కర్నూలు-డోన్ హైవేలో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమతులు లేకుండా టిప్పర్‌లో రోడ్డు మెటల్ గ్రావెల్, లారీలో డోలమైట్ పౌడర్ తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకుని ఉల్లిందకొండ పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారించి జరిమానా విధిస్తామని డీడీ తెలిపారు. తనిఖీలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, టెక్నికల్ అసిస్టెంట్ బాలు నాయక్ ఉన్నారు.

సిటీ బస్సులు నడపాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలో సిటీ సబర్బన్ బస్సులను నడిపి పేద, మధ్య తరగతి ప్రజలకు అధిక ఆటో చార్జీల నుంచి విముక్తి కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

అర్హత ఉంటే ఇంటి వద్దకే పింఛన్



కరిమద్దెలలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

గడివేముల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉంటే ఇంటికే పింఛన్ వస్తుందని మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని కరిమద్దెల గ్రామ సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను అందజేశారు. కొత్తగా మంజూరైన పింఛన్ దారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకన్న, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ డాలుస్వామి తదితరులు పాల్గొన్నారు.



చనుగొండ్లలో పింఛన్ సొమ్మును అందిస్తున్న ఎంపీపీ సునీత

అర్హులందరికీ పింఛన్లు

గూడూరు రూరల్ : ప్రభుత్వం అర్హత కలిగిన వారందరికీ కొత్త పింఛన్లను మంజూరు చేస్తుందని ఎంపీపీ సునీత అన్నారు. చనుగొండ్లలో కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామానికి రెండవ విడత కింద ప్రభుత్వం 15 మందికి కొత్త పింఛన్లను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచు వెంకటేశ్వరమ్మ, కో ఆప్షన్ సభ్యుడు దొల, తిరుమలేశ్వరరెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- పెద్దాసుపత్రిలో విద్యుత్ బిల్లులు చెల్లించని ఏజెన్సీలు
- తాజాగా మరోసారి నోటీసులు



ఆసుపత్రిలోని సీటీ స్కాన్ కేంద్రం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చెందిన విద్యుత్‌ను యథేచ్ఛగా వాడుకుంటూ బిల్లులు చెల్లించకుండా ఉన్న ఏజెన్సీల నిర్వాహకులను గత నెల జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించినా ఫలితం లేకుండా పోయింది. ఈ నెల 10 లోపు మొత్తం రూ.1.06 కోట్ల పెండింగ్ విద్యుత్ బిల్లులు చెల్లించాలని, లేకపోతే ఆయా సంస్థలను సీజ్ చేస్తామని ఆమె హెచ్చరించినా నిర్వాహకులు ఖాతర్ చేయలేదు. అధికారులు మళ్లీ పిలిచి అడిగితే తాజాగా మరో రెండు నెలలు గడువు కావాలని కోరడం గమనార్హం. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి గురువారం ఎంఆర్ఐ, సీటీ స్కాన్ సిబ్బందిని పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల మాట కూడా లెక్కచేయని పరిస్థితిలో ఉన్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌ల వద్ద నోటీసులు అతికించాలని సిబ్బందిని ఆదేశించారు. 11రోజుల్లోగా బిల్లులు కట్టకపోతే వారి సేవలన్నీ నిలిపివేస్తామని హెచ్చరించారు.

ఘనంగా హిందీ దివస్



హిందీ ఉపాధ్యాయురాలు సహరబానును సన్మానిస్తున్న దృశ్యం

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో హిందీ దివస్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మేరీ సలోమి పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు సహరా బాను తయారు చేసిన పలు ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమానికి గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ క్రిష్ణానాయక్ హాజరై మాట్లాడారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. గురువారం స్థానిక పాతబస్తీలోని జమ్మిచెట్టు వద్ద క్రీడా మైదాన అభివృద్ధి పనులు, హిందూ, ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. నిర్ణీత గడువు లోపు పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరపాలక పరిధిలో అభివృద్ధి పనులకు రూ.కోట్లు ఖర్చు పెడుతున్నామన్నారు. నగర వాసులకు మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థులకు, యువతకు క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషసాయి, షాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

పాణ్యం: పాణ్యంలో మండల స్థాయి క్రీడాపోటీలను గురువారం సర్పంచ్ మేకల పల్లవి ప్రారంభించారు. మండలంలోని 12 పాఠశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అన్ని రకాల క్రీడలతో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో పాల్గొని క్రీడాపోటీల్లో రాణించాలని సర్పంచ్ సూచించారు. ఎంఈఓ-2 సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శనీయులు హరిసర్వోత్తముడు



గాడిచర్ల విగ్రహానికి పూలమాల వేస్తున్న సుభాస్‌చంద్రబోస్

కర్నూలు కల్చరల్: గాడిచర్ల హరి సర్వోత్తమ రావు ఆదర్శనీయులని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం గాడిచర్ల హరిసర్వోత్తమ రావు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుభాస్ చంద్రబోస్ మాట్లాడుతూ గ్రంథాలయాల వ్యాప్తి, వయోజన విద్య కోసం కృషి చేసిన హరి సర్వోత్తమ రావు మన జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరియన్ ఎస్.బాషా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన



గొందిపర్ల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

కర్నూలు (న్యూటౌన్):రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్‌లను కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ పరిశీలించారు. గురువారం సాయంత్రం కర్నూలు మండలం పంచలింగాల, గొందిపర్ల, ఈ తాండ్రపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ బూత్‌లు ఎలా ఉన్నాయి, నీటివసతి, టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్, దివ్యాంగులకు ర్యాంప్, ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఉంది? అనే అంశాలను పరిశీలించారు. ఒకే కుటుంబంలోని వారందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసు కోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు, వీఆర్‌ఓలు మద్దిలేటి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పీజీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆరు కేంద్రాల్లో జరుగుతున్న పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా 85 మంది గానూ 83 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు.

ఆర్‌యూలో అవగాహన సదస్సు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలోని సెమినార్ హాల్‌లో గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐడీ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్పెషల్ సెషన్స్ జడ్జి భూపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో న్యాయం ఎలా పొందాలో విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో సీఐడీ ఎస్పీ ఎంవీఎస్ స్వామి, జిల్లా అడిషనల్ ఎస్పీ టి.సర్కార్, ఆర్‌యూ రెక్టార్ సీవీ.కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ వై.హరిప్రసాద్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఎన్.యుగంధర్ బాబు, కర్నూలు టౌన్ డీఎస్పీ విజయశేఖర్, దిశా డీఎస్పీ సుధాకర్ రెడ్డి, సీఐడీ ఇన్‌స్పెక్టర్ డి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.